క్లుప్తంగా

నియామకం



చేర్యాల(సిద్దిపేట): యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మండల పరిధిలోని చిట్యాలకు చెందిన బందిగ రాకేష్‌కృష్ణను నియమిస్తూ యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా రాకేష్‌కృష్ణ మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నిజాయితీగా నిర్వర్తించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నాడు.

'మహాధర్నాను జయప్రదం చేయండి'

హుస్నాబాద్‌రూరల్: గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 22వ తేదీన ఇందిరాపార్కు వద్ద చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని గౌడ సంఘం నాయకుడు రవీందర్ పిలుపునిచ్చారు. శనివారం పందిల్ల, మడద, రాములపల్లి గ్రామాల్లో మహాధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గీత కార్మికులు మంద శ్రీనివాస్, బొమ్మగాని రవీందర్, బండారి కిష్టయ్య, జాగిరి దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని తాజ్ గార్డెన్‌లో రేబర్తికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంతృత్వ పాలన సాగిస్తున్నాయని మండిపడ్డారు. జనగామ నియోజకవర్గ అభివృద్ధికి పొన్నాల లక్ష్మయ్య ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, బెక్కల్ సర్పంచ్ కూకట్ల బాలరాజు యాదవ్, మాజీ సర్పంచ్ సురేశ్, శివయ్యగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ ఓజోన్ దినోత్సవం

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో శనివారం వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఓజోన్ పరిరక్షణ పోస్టర్ ప్రజెంటేషన్‌ను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ప్రసాద్ ప్రారంభించారు. పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమానికి రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వాసం శ్రీనివాస్, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మదన్‌మోహన్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో గౌడ కులస్తులకు రూ. 15 లక్షలతో నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీ భవన్‌కు శనివారం భూమిపూజ చేశారు. సీఎం కేసీఆర్ పాలనలో తమ గ్రామ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆనందం, రమేష్, అహ్మద్, నిజామొద్దీన్, నర్సాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

నంగునూరు(సిద్దిపేట): ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సీఐ రామకృష్ణ అన్నారు. శనివారం పాలమాకుల ఉన్నత పాఠశాలలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపడం చట్ట ప్రకారం నేరమన్నారు. హెచ్ఎం ప్రభాకర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

'రుతుప్రేమ'పై అవగాహన

నంగునూరు(సిద్దిపేట): ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను తెలుసుకొని వాటికి దూరంగా ఉండాలని పర్యావరణ సంరక్షకురాలు డాక్టర్ శాంతి అన్నారు. శనివారం మండలంలోని బద్దిపడగలో మహిళలకు రుతుప్రేమపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం శాంతి మాట్లాడుతూ మహిళలు ప్యాడ్స్ వాడకాన్ని తగ్గించుకొని మెన్సెస్ కప్పు వాడాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉమ, సర్పంచ్ కొండల్‌రెడ్డి, ఎంపీటీసీ జ్యోత్స్న లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

మట్టి గణపతికి జై..

పర్యావరణహితమే అభిమతం



కలెక్టరేట్ సిబ్బందికి మట్టి గణపతులను అందిస్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



చిన్నకోడూరు: మట్టి గణపతులతో విద్యార్థులు

మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదామని జిల్లావ్యాప్తంగా శనివారం అవగాహన కల్పించారు. పాఠశాలల్లో విద్యార్థులు మట్టి వినాయకులను తయారు చేశారు. రసాయన రంగుల విగ్రహాలు పర్యావరణానికి నష్టం కలిగిస్తాయని వివరించారు. పలుచోట్ల గణేశ్ ప్రతిమలను పంపిణీ చేశారు.



గజ్వేల్‌రూరల్: నవధాన్యాలతో 12 అడుగుల వినాయకుడి రూపాన్ని చిత్రించిన రామకోటి రామరాజు



సిద్దిపేటకమాన్: మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు



సిద్దిపేటజోన్: మట్టి వినాయకుల తయారీని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మట్టి వినాయకులతో కాకతీయ టెక్నో స్కూల్ విద్యార్థులు

డంపింగ్‌యార్డ్ నిర్వహణ భేష్



డంపింగ్‌యార్డులో ఎరువును పరిశీలిస్తున్న అధికారులు

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని రాఘవాపూర్ డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్త నిర్వహణ, కంపోస్టు ఎరువుల తయారీ ఎంతో బాగుందని నిర్మల్ జిల్లా అధికారులు కితాబిచ్చారు. శనివారం గ్రామంలోని డంపింగ్ యార్డు, గ్రామ పంచాయతీ భవనాలను నిర్మల్ జిల్లా డీఎల్‌పీఓ, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమాలు బాగున్నాయని పేర్కొన్నారు.

స్వచ్ఛతలో సిద్దిపేట మేటి

సిద్దిపేటజోన్: స్వచ్ఛతలో సిద్దిపేట రాష్ట్రానికి ఆదర్శంగా ఉందని నిర్మల్ జిల్లా పంచాయతీ శాఖ అధికారులు పేర్కొన్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సూచనల మేరకు శనివారం 45 మంది అధికారులు సిద్దిపేట మున్సిపాలిటీలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ముందుగా స్వచ్ఛ బడిని సందర్శించారు. అలాగే చెత్త ప్రాముఖ్యత, సేంద్రియ ఎరువుల తయారీ, నర్సరీ, హోం కంపోస్ట్ తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం పట్టణంలో పర్యటించారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా అధికారులు, సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కౌన్సిలర్ దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ పథకం ఆదర్శం



గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: గొర్రెల పంపిణీ పథకంతో మంచి ఫలితాలు వస్తున్నాయని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్‌ఆర్ కాలనీలో గల పల్లెపహాడ్‌లో 14 యూనిట్లను గొల్ల, కురుమలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఇలాంటి గొప్ప పథకం లేదన్నారు. కార్యక్రమంలో వర్గల్ జెడ్పీటీసీ బాలుయాదవ్, సర్పంచ్ గుగులోత్ చిన్న రజిత, ఉప సర్పంచ్ లలిత, బీఆర్ఎస్ గజ్వేల్ పట్టణ శాఖ అధ్యక్షుడు నవాజ్‌మీరా, నాయకులు కిషన్‌రెడ్డి, యాదవ మహాసభ అధ్యక్షుడు కనకరాజ్, ఉపాధ్యక్షుడు మల్లేశ్, ప్రధాన కార్యదర్శి నరేశ్, మాజీ జెడ్పీటీసీ రాములు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు శనివారం సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో నియోజకవర్గ కేంద్రంగా ఉన్న చేర్యాల గత పాలకుల నిర్లక్ష్యంతో అస్తిత్వం కోల్పోయిందన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తిరిగి అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అంశం సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు దృష్టిలో ఉందని.. త్వరలోనే కోరిక నెరవేరుతుందని హామీ ఇచ్చారు. అంతకుముందు పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చింతల రవి, పట్టణ పార్టీ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావును పరామర్శించారు. అలాగే పట్టణకేంద్రంలో రూ. 17 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ బిల్డింగ్ పనులు, అంబేద్కర్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య, కౌన్సిలర్లు చంటి, సతీష్, మార్కెట్ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, అంజయ్య, యాదగిరి, కిష్టయ్య, భిక్షపతి తదితరులు ఉన్నారు.

రసాభాసగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ తలారి కీర్తన

కొమురవెల్లి(సిద్దిపేట): బీఆర్ఎస్ నాయకులు తమ గ్రామ పంచాయతీకి సంబంధించిన పనులు ప్రారంభించకుండా అడ్డుపడుతున్నారని రాంసాగర్ సర్పంచ్ తాడూరి రవీందర్ ఎంపీపీ తలారి కీర్తనతో వాగ్వాదానికి దిగడంతో మండల సభ రసాభాసగా మారింది. శనివారం సర్వసభ్య సమావేశం ప్రారంభం కాగానే వివిధ శాఖలకు చెందిన అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. మండలంలోని మర్రిముచ్చాల పంచాయతీలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని ఎంపీపీ కీర్తన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మికి తెలిపారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని సూచించారు. తమ గ్రామానికి మంజూరైన బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులను పిలిస్తే రాలేదని.. పనులు సైతం చేయనివ్వడం లేదని సర్పంచ్ రవీందర్ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సభ కొంతసేపు రసాభాసగా మారింది. ఎంపీడీఓ అనురాధ జోక్యం చేసుకొని భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూస్తామని చెప్పడంతో సమస్య సద్దు మనిగింది. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. పల్లెలు పట్టణాలకు దీటుగా అభివృద్ధి చెందాయని వివరించారు. మండలంలో మొత్తం గృహలక్ష్మి దరఖాస్తులు 1,005 వచ్చాయని, వాటిలో 762 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించామని ఎంపీడీఓ అనురాధ సభకు తెలిపారు. సమావేశానికి హాజరుకాని అధికారులకు మెమోలు జారీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పండుగలు జరుపుకోవాలి



మాట్లాడుతున్న గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి

గజ్వేల్‌రూరల్: ప్రశాంత వాతావరణంలో వినాయక నవరాత్రోత్సవాలను జరుపుకోవాలని 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, గజ్వేల్ ఏసీపీ రమేష్, ఆర్డీవో బన్సీలాల్ సూచించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక మండప నిర్వాహకులు ఇతరులకు ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మండపాల నిర్వహణకు అనుమతులు పొందాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, ప్రజాప్రతినిధులు, నాయకులు, మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



మద్దూరు: మాట్లాడుతున్న పుష్పలత

మద్దూరు(హుస్నాబాద్): చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత అన్నారు. శనివారం మద్దూరు మండలంలోని రేబర్తిలో పోషణ్ మాసోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాల ప్రాముఖ్యతపై గర్భిణులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖాజామొయినోద్దీన్, పంచాయతీ కార్యదర్శి మాధవ్ జాదవ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

గజ్వేల్‌రూరల్: గర్భిణులు పౌష్టికరమైన ఆహారం తీసుకున్నప్పుడే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతులుగా ఉంటారని గజ్వేల్ మండలం బయ్యారం సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య పేర్కొన్నారు. శనివారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అనిత, స్రవంతి పాల్గొన్నారు.

సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

హుస్నాబాద్‌రూరల్: విద్యార్థులను ఉపాధ్యాయులు వివిధ రంగాల్లో రాణించే విధంగా తీర్చిదిద్దాలని ఎంపీపీ లకావత్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత మానస పేర్కొన్నారు. శనివారం పోతారం(ఎస్) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ దేశిరెడ్డి, హెచ్‌ఎంలు బండారి మనీల, వెంకటయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల్లా మిగిలాం

మండల సమావేశంలో సర్పంచ్‌ల ఆవేదన



సమస్యలను ప్రస్తావిస్తున్న సర్పంచ్ రాజేంద్ర

నంగునూరు(సిద్దిపేట): సంక్షేమ పథకాలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు చెప్పకుండా పంపిణీ చేస్తూ ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాల్లా చూస్తున్నారని మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నంగునూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ జాప అరుణాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా రాజగోపాల్‌పేట సర్పంచ్ రాజేంద్ర మాట్లాడుతూ.. ఏడేళ్లుగా పంచాయతీ భవన నిర్మాణం పూర్తి కావడం లేదని, దళితుడిని కావడంతోనే వివక్ష చూపుతున్నారని వాపోయారు. కొందరు నాయకులు తమ అనుచరులకే బీసీ కార్పొరేషన్, గృహలక్ష్మి, దళితబంధు పథకాలు ఇప్పిస్తున్నారని ఆరోపించారు. కాల్వల నిర్మాణంతో భూములు కోల్పోయిన వారిలో కొందరికే చెక్కులు వచ్చాయని గట్లమల్యాల సర్పంచ్ రమేశ్ ఆరోపించారు. జెడ్పీటీసీ ఉమ, రమేశ్‌గౌడ్, కృష్ణారెడ్డి, మహిపాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన

దౌల్తాబాద్(దుబ్బాక): అంగన్‌వాడీ టీచర్లు సమస్యల సాధన కోసం సమ్మె చేస్తుంటే ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కర్ అన్నారు. శనివారం అంగన్‌వాడీ టీచర్ల సమ్మెకు మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా అంగన్‌టీచర్లు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్ టీచర్ల యూనియన్ అధ్యక్షురాలు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తిని కొనసాగించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): తెలంగాణ అమరవీరుల స్ఫూర్తిని కొనసాగించాలని డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. డీబీఎఫ్, రాష్ట్రీయ మూల నివాస్ సంఘ్ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక పరివర్తన పాదయాత్ర శనివారం కొండాపూర్‌కు చేరుకుంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేయాలని కోరారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంక్‌లు సాధించి ఆదర్శంగా నిలవడం మంచి పరిణామమని కొనియాడారు. అలాగే కళాశాలలోని 18 మంది విద్యార్థులు ఎంసెట్‌లో మంచి ర్యాంక్‌లు సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో డీఐఓ సూర్యప్రకాష్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కళాశాల ప్రిన్సిపాల్ రాంచంద్రారెడ్డి, బాలుర కళాశాల ప్రిన్సిపాల్ దేవస్వామి, హెచ్‌ఎంలు బండారి మనీల, వెంకటయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **క్షీరాభిషేకం**

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దసరా కానుకగా అల్పాహారం అందజేస్తామని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం టీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో నర్మేట ఉన్నత పాఠశాలలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు మహిపాల్‌గౌడ్, కోఆర్డినేటర్ రమేష్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ మంత్రి హరీశ్‌రావు ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు.

◆ **ఓటమి గెలుపునకు నాంది**

తొగుట(దుబ్బాక): క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమితో కుంగిపోకుండా విజయం కోసం కృషి చేయాలని పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని గుడికందులలో మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లయ్య, ఉప సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంఈఓ యాదవరెడ్డి, హెచ్‌ఎం అంజలి, ఏఎంసీ డైరెక్టర్ బాల్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ బాలరాజు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **నేడు మాలల ఆత్మీయ సమ్మేళనం**

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట- భూంపల్లి మండలంలోని ఎస్‌బీఆర్ గార్డెన్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు మండల కమిటీ బాధ్యులు ర్యాకం శ్రీరాములు, కూతురు నర్సింలు తెలిపారు. కార్యక్రమానికి మాల ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని సూచించారు.

◆ **కుట్టు శిక్షణా కేంద్రాలను వినియోగించుకోండి**

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం మహిపాల్ అన్నారు. శనివారం చిన్నకోడూరుతో పాటు చెలుకలపల్లి, ఎల్లాయపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న శిక్షణా కేంద్రాలను ఆయన సందర్శించారు. ఆయనతో పాటు సీసీ శ్రీనివాస్‌రెడ్డి, మహిళా సమాఖ్య సభ్యులు ఉన్నారు.

◆ **పేద కుటుంబాన్ని ఆదుకోవాలి**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లికి చెందిన కనుకుంట్ల అంజయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పెద్దాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తోటపల్లిలో శనివారం బీఎస్పీ ప్రచార కార్యక్రమంలో భాగంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కార్యదర్శి వెంకన్న, నిశాని రాజమల్లు, తదితరులు పాల్గొన్నారు.

◆ **పంచాయతీ కార్మికుల ధర్నా**

నంగునూరు(సిద్దిపేట): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి చొప్పరి రవికుమార్ మాట్లాడుతూ సమ్మె కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం మభ్య పెడుతుందని మండిపడ్డారు.

◆ **భూమి పూజ**

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లిలోవిలేజ్ ఫంక్షన్‌హాల్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి రూ.70 లక్షలతో నిర్మించే డైనింగ్ హాల్‌కు సర్పంచ్ మల్లమారి రవీందర్ శనివారం భూమి పూజ చేశారు.

◆ **తహసీల్దార్‌కు ఫిర్యాదు**

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్‌పల్లెలో బీఆర్ఎస్‌కు ఓటేస్తామని సర్పంచ్ ఆధ్వర్యంలో చేసిన ఏకగ్రీవ తీర్మానం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు కోటి ఆధ్వర్యంలో బెజ్జంకి తహసీల్దార్ వెంకట్‌రెడ్డికి, ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

◆ **సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం**

కొండపాక(గజ్వేల్): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ అన్నారు. శనివారం కుకునూరుపల్లి మండలంలోని మేదినీపూర్‌లో బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దశరథం, నాయకులు విరుపాక రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **రాజ్యాధికారంతోనే పరిష్కారం**

కొమురవెల్లి(సిద్దిపేట): రాజ్యాధికారం వస్తేనే ముదిరాజుల బతుకులు బాగుపడుతాయని మత్స్యకారుల సంఘం జిల్లా డైరెక్టర్ తేలు ఇస్తారి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ద్విచక్ర వాహన ర్యాలీకి మండలవ్యాప్తంగా ముదిరాజులు తరలివెళ్లారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్ట సభల్లో ముదిరాజులకు స్థానం లేక తీవ్ర అన్యాయం జరిగిందని.. వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.